## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో గేదె మృతి

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామంలో డీలర్ ముత్తవ్వకు చెందిన గేదె కరెంట్‌షాక్‌తో మృతి చెందింది. బాధితురాలి కథనం ప్రకారం గేదెను మేపేందుకు ఎప్పటిలాగే గ్రామశివారులోకి పశువుల కాపరులు తీసుకెళ్లారు. మధ్యాహ్నం దోబీఘాట్ వద్ద పశువుల మందను నీళ్లు తాగించేందుకు తోలుకెళ్లారు. అక్కడ విద్యుత్ సరఫరా అవుతూ తెగిపడిన 11కేవీ తీగలు తగిలి ముత్తవ్వ గేదె మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని.. అధికారులు పరిహారం చెల్లించాలని బాధితురాలు వేడుకున్నారు.

### పొక్లెయినర్ బోల్తా.. డ్రైవర్ సురక్షితం


డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో గురువారం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల కోసం బుధవారం పెద్దబెల్లాల్ చెరువు వద్ద ఏర్పాట్లు చేస్తుండగా పొక్లెయినర్ అదుపుతప్పి చెరువులో పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాలేదు. పొక్లెయిన్ డ్రైవర్ మామిడాల మహేశ్‌ను వాహనంలోంచి బయటకు తీసి కాపాడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

### పులిహోర పంపిణీ


కాంప్లెక్స్ వద్ద పంపిణీ చేస్తున్న సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలో బుధవారం దుర్గా మాత నిమజ్జనోత్సవం సందర్భంగా శోభాయాత్ర మార్గంలో పలువురు స్వచ్ఛందంగా అన్నదానం, పులిహోర పంపిణీ చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద వాసవి యూత్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద, బస్టాండ్ రోడ్డులో తిరుమల హార్డ్‌వేర్ ఆధ్వర్యంలో పులిహోర, నీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పవార్ రామారావుపటేల్ సైతం పులిహోర పంపిణీలో పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం లెక్కింపు

లోకేశ్వరం: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని కన్కాపూర్‌లో మండపం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. నగదు రూ.49,298 రాగా.. 80 గ్రాముల వెండి, నాలుగు గ్రాముల బంగారం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్, పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

### ఓలాలో ఉట్టి వేడుకలు


కార్యక్రమం ప్రారంభిస్తున్న నాయకులు

కుంటాల: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండలంలోని ఓలా గ్రామంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఎంపీటీసీ కట్టరవి, వీడీసీ చైర్మన్ నాలం మహేందర్ తదితరులు ఉన్నారు.

### 'బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు పనిచేస్తా'


కల్యాణిలో మాట్లాడుతున్న రమాదేవి

తానూరు: నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని ఓడించేందుకు పని చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కల్యాణి, కుప్టి గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. 10 ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తే.. తనకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ అధిష్టానం మోసం చేసిందని వాపోయారు. తనకు జరిగిన అన్యాయాన్ని కార్యకర్తలు, ప్రజలకు వివరించారు.

### ఉపాధ్యాయులకు సన్మానం

కుంటాల: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తాటి సోమేశ్వర్, వంగల సుధాకర్, తొందూరు సాయన్న మంత్రి ఐకేరెడ్డి, డీఈఓ రవీందర్‌రెడ్డి చేతుల పురస్కారం మీదుగా అందుకున్నారు. కాగా వీరిని టీఈడబ్ల్యూఏ ఆధ్వర్యంలో బుధవారం కుంటాలలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భూమన్నయాదవ్, కె.కృష్ణారావు, సక్రపు గజేందర్, దాసరి రమేశ్, న్యాలకంటి గజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో భగీరథ కష్టాలు

- ఇంటింటికీ సరఫరా కాని తాగునీరు
- నల్లా కనెక్షన్లు ఇచ్చి వదిలేసిన వైనం
- అసంపూర్తి పనులతో పట్టణవాసులకు ఇబ్బందులు
- పనులు పూర్తి చేయాలని వేడుకోలు


పైప్‌లైన్‌తో డ్రైయిన్‌లో నీరు నిలవడంతో తిరిగి మరమ్మతు చేపడుతున్న సిబ్బంది


పైపులైన్ పనులతో కంకర తేలిన సీసీరోడ్డు


చుట్టగా వదిలేసిన నల్లా కనెక్షన్ పైపులు

భైంసాటౌన్: ఇంటింటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు భైంసా పట్టణంలో నత్తనడకన సాగుతున్నాయి. ప్రజారోగ్య శాఖ అధికారులు ఇష్టానుసారం పనులు చేపట్టడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో నీరందక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు లక్ష్యం మేర ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చినా.. పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. దీంతో కొన్నిచోట్ల పాత నల్లా నీరు, మరికొన్నిచోట్ల బోరు మోటార్ల ద్వారా అందించే ట్యాంకు నీరే దిక్కవుతోంది. అవి అపరిశుభ్రంగా ఉండటంతో శుద్ధమైన తాగునీరుకు ప్రజలు దూరమవుతున్నారు. కల్వర్టులు, నాలాల వద్ద భగీరథ పైప్‌లైన్లు వేయడంతో మురుగు ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతవాసులు అవస్థలు పడుతున్నారు. పైపులైన్ల కోసం గుంతలు తవ్విన చోట అసంపూర్తిగా పూడిక పనులు చేపట్టడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

**కనెక్షన్లు ఇచ్చి ఏడాదిన్నర..**

భైంసా పట్టణంలో దాదాపు 60వేల వరకు జనాభా ఉండగా, 26 వార్డుల పరిధిలో 14వేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. మిషన్ భగీరథలో భాగంగా 15,170 నల్లా కనెక్షన్లు లక్ష్యం కాగా.. దాదాపు పూర్తిస్థాయిలో కనెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ, నల్లా కనెక్షన్లు ఇచ్చి దాదాపు ఏడాదిన్నరకుపైగా గడిచినా నీరు అందని ప్రాంతాలు చాలానే ఉన్నాయి. భట్టిగల్లి, గణేశ్‌నగర్, కోర్వగల్లి, దోబి గల్లి, పద్మావతికాలనీ, కిసాన్‌గల్లి, జుల్ఫికర్ గల్లి, బ్రాహ్మణ్‌గల్లి, పురాణబజార్, రాహుల్‌నగర్, తదితర కాలనీల్లో ఇంటింటికీ పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు.

**కొన్ని కాలనీలకే శుద్ధజలం సరఫరా..**

ఓవైసీనగర్, కుంట ఏరియా, పూలేనగర్, రాంనగర్‌తోపాటు శివారు కాలనీలకు మాత్రం మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా నల్లా కనెక్షన్ల బిగింపులో సంబంధిత అధికారులు ఇష్టారీతిన వ్యవహరించారు. చాలా చోట్ల నల్లా కనెక్షన్లకు పైపులు బిగించి వదిలేశారు. పైపులకు నల్లా పిడిలు బిగించలేదు. కొన్నిచోట్ల నాలాల నుంచి పైపులు వేశారు. పట్టణంలో దాదాపు 50శాతానికిపైగా ఇళ్లకు భగీరథ జలం అందడం లేదు. దీంతో అధికారులు పనులు త్వరితగతిన పూర్తి చేసి నల్లా నీరు సరఫరా చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

**నీరందేలా చర్యలు..**

పట్టణంలో భగీరథ పనులు దాదాపు పూర్తయ్యాయి. 15వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇచ్చాం. కొన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కొన్ని కాలనీలకే పూర్తిస్థాయిలో నీరందిస్తున్నాం. మిగతా చోట్లా సమస్యలు పరిష్కరించి నీరందేలా చూస్తాం.

– హరిభువన్, ప్రజారోగ్య విభాగం, ఏఈ

**నల్లా కనెక్షన్ ఇచ్చి వదిలేశారు**



నెలల కిందట మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చి వదిలేశారు. తాగునీరు మాత్రం సరఫరా కావడం లేదు. పాత కుళాయి ద్వారానే నీరు వస్తోంది. భగీరథ నల్లాల ద్వారా నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మీబాయి, బోయిగల్లి, భైంసా

**నీళ్లు వస్తలేవు..**



మా గల్లిలో ఏడాది కిందట మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇచ్చారు. అయినా ఇప్పటికీ నీళ్లు వస్తలేవు. కనెక్షన్ ఇచ్చి వదిలేసిండ్రు. నల్లాకు పిడి కూడి ఇవ్వలేదు.

– రాధబాయి, కోర్వగల్లి, భైంసా

## కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి


కేంద్రం ప్రారంభిస్తున్న ఏవో ప్రవీణ్‌కుమార్

లక్ష్మణచాంద: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు తమ పంటను విక్రయించాలని ఏవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏవో ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2090 అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ఉమ, పవిత్ర, సంతోష్, పీఏసీఎస్ సీఈవో ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సీఈవో చిన్నయ్య ప్రారంభించారు. పంటను దళారులకు అమ్మకుండా కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

సారంగాపూర్: ఎన్నికల వేళ విధులు నిర్వర్తించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి ఈనెలలో పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, వాటి పురోగతి గురించి ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌ను మళ్లీ ఆదరించాలి


వాడవనలో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు

తానూరు: బీఆర్‌ఎస్‌ను ఆదరించి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆపార్టీ నాయకులు ఓటర్లను కోరారు. బుధవారం మండలంలోని వాడవన, ఎల్వత్ గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, బాబురావ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**సారంగపూర్ మండలంలో..**

సారంగపూర్: మండలంలోని సాట్యా, రాంసింగ్‌తండా, కుప్టి గ్రామాల్లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ మండల ఇన్‌చార్జి నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఇంద్రకరణ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. వారి వెంట వెంకట్రామిరెడ్డి, రాజు, రవీందర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, మహిపాల్‌రెడ్డి, మాధవరావు తదితరులు ఉన్నారు.

# వైభవంగా శోభాయాత్ర, నిమజ్జనం


కుంటాలలో నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు


లోకేశ్వరం: రాజూరలో అమ్మవారి శోభాయాత్రలో మంగళహారతులతో భక్తులు

తానూరు: తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న దుర్గాదేవి బుధవారం గంగమ్మ ఒడికి చేరుకుంది. భక్తుల ఆటపాటలు, తీన్మార్ స్టెప్పుల నడుమ నిర్వహించిన శోభాయాత్ర ఆద్యంతం ఆకట్టుకుంది. మండల కేంద్రంతోపాటు ఎల్వి, బోల్సా, బెల్‌తరోడా, భోసి, జౌలా(బి), ఉమ్రి(కే), కొలూరు గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనం కనుల పండువగా నిర్వహించారు. గ్రామాల్లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం, సిద్దూర్, కామోల్, మహాగాం, ఇలేగాం, దేగాం, వాలేగాం, కుంసర, కుంబి తదితర గ్రామాల్లో బుధవారం దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. వీధుల్లో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించగా మహిళలు, యువతులు కోలాటం వేస్తూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో దుర్గామాత నిమజ్జనం చేశారు. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుంటాల: మండలకేంద్రంలో బుధవారం దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు.ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నర్సాపూర్(జి):మండలంలోని చాక్‌పల్లి పంచాయతీలోని బూరుగుపల్లి(కె) గ్రామంలో దుర్గామాత నిమజ్జనం నిర్వహించారు. శోభాయాత్రలో ముధోల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవార్ రామారావు పటేల్ మహిళలు, చిన్నారులతో కలిసి కోలాటం వేసి సందడి చేశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. నవీన్, గొంద్ర సంతోష్, లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర, జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో బుధవారం దుర్గామాత నిమజ్జనం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అనంతరం గోదావరి తీరంలోని బ్రహ్మేశ్వరాలయం, పంచగుడి సమీపంలోని వంతెన వద్ద ప్రతిమలను నిమజ్జనం చేశారు.


తానూరు: భోసిలో శోభాయాత్రలో భక్తులు


భైంసారూరల్: కుంసరలో అమ్మవారి నిమజ్జనం


కోతల్‌గాంలో కోలాటం ఆడుతున్న మహిళలు

### సన్మానం

ఖానాపూర్: బీజేపీ ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన అంకం మహేందర్‌ను బుధవారం పట్టణంలో పలువురు బీజేపీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎనగందుల రవి, ఇనుముల స్వామి, తోకల బుచ్చన్న, పిట్టల భూమన్న, తిరుమల గిరి ఉన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ ప్రచారం

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు భూమారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు. ఉదయం ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పథకాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు.

**సూర్యాపూర్‌లో ఎమ్మెల్యే..**

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో గురువారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 'హామీ ఇచ్చి అన్యాయం చేసిన బీజేపీ'


మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: గిరిజన మహిళ అయిన తనకు టికెట్ ఇస్తామని బీజేపీ అధిష్టానం హామీ ఇచ్చి తీవ్ర అన్యాయం చేసిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, పెంబి జెడ్పీటీసీ భుక్యా జానుబాయి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఒక్క మహిళకు కూడా టికెట్ ఇవ్వకుండా పార్టీ మహిళల పట్ల వివక్ష చూపుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన వారికి కాకుండా సూటుకేసులు ఇచ్చిన వారికి టికెట్ కేటాయించారని ఆరోపించారు. ఖానాపూర్ టికెట్‌పై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలని కన్నీరుమున్నీరయ్యారు. తనను ఇప్పటివరకు అధిష్టానం తరపున ఎవరూ పలకరించలేదని వాపోయారు. భవిష్యత్తు కార్యాచరణను రెండు రోజుల్లో ప్రకటిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో హపావత్ రాజేందర్, ముక్కెర గంగాధర్, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, భూమారెడ్డి, బైరి శ్రీను, పవన్, సుధాకర్, మోహన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

### అంబేద్కర్ సంఘ నియోజకవర్గ కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలో బుధవారం అంబేద్కర్ సంఘం నియోజకవర్గ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికలో సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా అర్ల రమేశ్, ముఖ్య సలహాదారులుగా నేత శ్యామ్, కన్వీనర్‌గా మునుగూరి ప్రణీత్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్, మునుగూరి ప్రణీత్, బద్దెన్న, శైలెందర్, రాజేందర్, సతీశ్, మైపాల్, రాజ్‌కుమార్, సాయి, రాజన్న, రవి, తదితరులున్నారు.

### బీజేపీకి రాజీనామా

కుంటాల: బీజేపీ ముధోల్ అసెంబ్లీ టికెట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకండి రమాదేవికి కేటాయించనందుకు రాజీనామా చేస్తున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆప్క గజేందర్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన రమాదేవికి టికెట్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు మొరం పోయండి



లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్- భైంసా మండలం బోరిగాం గ్రామాల మధ్య సుద్దవాగుపై నిర్మించిన వంతెన వద్ద భారీ వర్షాలకు ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి వంతెన వద్ద మొరం పోసి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్: 95506 07360

### విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రతిమల వద్ద నాయకులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో అంకం గంగుబాయి–ఆశన్నల జ్ఞాపకార్థం అంకం లక్ష్మిబాయి–గంగాధర్ రూ. 20 వేల వ్యయంతో బతుకమ్మలతో ఉన్న ప్రతిమలను బుధవారం ప్రతిష్ఠించారు. విగ్రహ దాతతో కలిసి సర్పంచ్ అంకం గంగా మణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించి మహిళలు ఆడిపాడారు. అనంతరం సమీపంలోని కాల్వలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఎంపీటీసీ నాగయ్య, ఉపసర్పంచ్ గడ్డం స్వామి, వీడీసీ అధ్యక్షులు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండ రవి, అంకం శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, మల్లయ్య, మహేశ్, కిరణ్‌రావు, భోజన్న, నర్సయ్య, లత, వనజ తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


కుంటాలలో బతుకమ్మల వద్ద మహిళలు


లోకేశ్వరం : కన్కపూర్‌లో..

కుంటాల: మండలంలోని కల్లూర్, కుంటాల, ఓలా, పెంచికల్‌పాడ్, అంబకంటి, లింబా(బి), లింబా(కె), దౌనెల్లి తదితర గ్రామాల్లో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీపంలోని నీటికుంటల్లో నిమజ్జనం చేశారు.

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్, నగర్ గ్రామాల్లో బుధవారం సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒకే చోట ఉంచి ఆడిపాడారు. అనంతరం ప్రధాన వీధుల గుండా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్, దేవన్న, చిన్నయ్య, గణేశ్, భోజన్న, భూమన్న ఉన్నారు.